విద్యుత్ కోతలు.. రైతుల తిప్పలు

ఉదయం, రాత్రి వేళ ఆరుగంటల పాటు సరఫరా

- టైమింగ్స్ తెలియక అన్నదాతల అయోమయం
- సాంకేతిక సమస్యల పేరుతో పది నుంచి 20సార్లు ట్రిప్
- ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదం
- రాత్రి వేళ పొంచి ఉన్న ప్రమాదం


సుందరగిరిలో కరెంట్ కోతలతో ఎండిపోతున్న వరి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పొద్దంతా పన్నెండు గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసిన ట్రాన్స్‌కో అధికారులు మార్పులు చేశారు. రాత్రి వేళ ఆరు, ఉదయం వేళ ఆరు గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పంటలకు నీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో కరెంట్ వస్తదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. పదిహేను రోజులుగా ట్రాన్స్‌కో సిబ్బంది ఫోన్‌కు వచ్చే మెసేజ్ ప్రకారం త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఏడీఈఈని అడగాలనడం విస్మయాన్ని కల్గిస్తోందని, ఎప్పుడు వస్తదో టైమింగ్స్ అయినా చెప్పాలని కోరినా పట్టించుకునే నాథుడేలేడని వాపోతున్నారు. ఇరవై రోజుల క్రితం వేకువజాము నుంచి సాయంత్రం వరకు త్రీఫేజ్ సరఫరా అయ్యేది.

పొలాలకు అందని నీరు

ప్రస్తుతం ఉదయం ఆరు, రాత్రి వేళ ఆరు నుంచి ఏడు గంటలపాటు కరెంట్ ఇస్తున్నారు. దీంతో పొలాలకు సరిగా నీరందడంలేదని, నెలరోజుల పాటు ఇలాగే కొనసాగితే పంటలు ఎండే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ వ్యవసాయబావుల వద్దకు వెళ్లే రైతులకు ప్రమాదం పొంచి ఉంది. పాములు, ఎలుగుబంట్లతో ప్రాణాపాయం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితిల్లో బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిగురుమామిడి, చిన్నముల్కనూర్, నవాబుపేట్, ఇందుర్తి, రేకొండలో మాత్రమే విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి నుంచి వ్యవసాయానికి, గృహాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. సాంకేతిక సమస్యల పేరుతో రోజుకు పది నుంచి ఇరవైసార్లు ట్రిప్ అవుతుందని, దీంతో పొలాలకు నీరందడం లేదని బోరుమంటున్నారు.

రైతులు సతమతం

కరెంట్ కోతలపై ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులను ఎక్కడికక్కడ నిలదీసి అవసరమైతే సబ్‌స్టేషన్లను ముట్టడించాలనే సమాలోచనలు చేస్తున్నారు. త్రీఫేజ్ వేళలు తెలియక రైతులు సతమతమవుతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తదో తెలియక బావులవద్ద పడిగాపులు కాస్తున్నామని, విద్యుత్ వేళలు తెలపాలని ఆయా గ్రామాల రైతులు నిరసన తెలుపుతున్నారు.

ఎకరం ఎండుతోంది



వ్యవసాయ బావి కింద ఏడెకరాల్లో వరి వేశాను. విద్యుత్ కోతల వల్ల ఇప్పటి వరకు ఎకరం పొలం ఎండింది. కరెంట్ ఎప్పుడు వస్తదో తెలియక ఆటోమేటిక్ స్టార్టర్ వేయక పొలం పారడంలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పొలం ఎండే పరిస్థితి ఉంది.

– కిష్టారెడ్డి, రైతు, లంబాడిపల్లి

స్టార్టర్ కాలిపోయింది



త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తదో తెలియక స్టార్టర్ వేశాను. వచ్చిపోయే కరెంట్ వల్ల స్టార్టర్ కాలిపోయింది. మూడెకరాల్లో వరి వేశాను ఉదయం, రాత్రి వేళల్లో పారించాల్సి వస్తోంది. ఇలాగైతే పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

– మంద శ్రీనివాస్, రైతు, గాగిరెడ్డిపల్లి

ఉత్పత్తికి మించి డిమాండ్



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో కోతలు విధించాల్సి వస్తోంది. ఉత్పత్తికి మించి డిమాండ్ పెరిగింది. అధికారుల ఫోన్ మెసెజ్ ప్రకారం సరఫరా చేస్తున్నాం. రైతులు సహకరిస్తే గడ్డు కాలం నుంచి బయటపడతాం.

– రాజిరెడ్డి, ఏఈఈ ట్రాన్స్‌కో ఇందుర్తి ఫీడర్, చిగురుమామిడి

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల

జమ్మికుంట: బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి క్యాలెండర్‌ను పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు సంఘటితంగా హక్కులు సాధించుకోవాలని, సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సామాజిక, రాజకీయ , ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంగుటూరి రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముద్రగడ నవీన్ కుమార్, జిల్లా నాయకులుకొలిపాక శ్రీనివాస్, డివిజన్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, కృష్ణ, తులసి లక్ష్మణమూర్తి, పంతాటి రవీందర్, ఏబూసి ఓదేలు, తాళ్ళపెల్లి కుమారస్వామి, కొమ్మురాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పనిచేస్తే సంఘాలు అభివృద్ధిలోకి


సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

జమ్మికుంట: పదవి విరమణ పొందుతున్న జమ్మికుంట పీఏసీఎస్ కార్యదర్శి ముదిగంటి ప్రకాశ్‌రెడ్డి సేవలు అభినందనీయమని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అధికారులు నిబద్ధత, క్రమశిక్షణతో పని చేస్తే సంఘాలు అభివృద్ధి లోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ... విధుల్లో సహకరించిన అధికారులు, సిబ్బంది, పాలకవర్గాలు, ప్రజా ప్రతినిధులు, సభ్యులు, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రకాశ్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, డీసీవో శ్రీమాల, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని కోటి స్వప్న, డైరెక్టర్స్, పలు మండలాల సీఈవోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం చేస్తున్న మౌనికచక్రధర్‌రాజు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మాతంగి సమ్మయ్య పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం కొంకట మౌనికచక్రధర్‌రాజు పరామర్శించి పదివేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు వెంకట స్వామి, మొగిలయ్య, కిరణ్, మాతంగి రాజయ్య, కొంరయ్య తదితరులున్నారు.

నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న వద్లూరి వాసు

హుజూరాబాద్: ప్రభుత్వం దళితబంధు రెండో విడుత నిధులు వెంటనే విడుదల చేయాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి వాసు అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడుతూ...పథకం కింద మొదటి విడుత మంజూరైన రూ.5 లక్షలతో యూనిట్లు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే మిగతా నిధులు ఖాతాల్లో జమ చేయాలన్నారు.

సమాచారం..

మండల సభ వాయిదా

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో కల్పన గురువారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు గైర్హాజరయ్యారని, కోరం లేనందున వాయిదా వేశామని ఎంపీడీవో ప్రకటించారు.

నేడు వారసంత ప్రారంభం

వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండ్, సమ్మక్క గద్దెల వద్ద శుక్రవారం వారసంత ప్రారంభిస్తామని సర్పంచ్ నీల కుమార్ తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా ప్రతి వారం సంత నిర్వహిస్తామని, ప్రజలు ఇబ్బంది పడకుండా అన్నిసౌకర్యాలు కల్పించామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపసర్పంచ్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం


అవిశ్వాస తీర్మానం పరిశీలిస్తున్న ఆర్డీవో

రామడుగు: రామడుగు ఉపసర్పంచ్ వద్లూరి రాజేందర్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయిందని కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం అవిశ్వాస తీర్మానంపై ఆర్డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 15 మంది వార్డు సభ్యులకు కేవలం ఏడుగురు మాత్రమే హాజరు కావడంతో తీర్మానం వీగిపోయిందని ప్రకటించారు. కార్యక్రమంలో రామడుగు ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశ కార్యకర్తల నిరసన


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు


చిగురుమామిడిలో ఆశ కార్యకర్తల నిరసన

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలని ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత ప్రభుత్వాన్ని కోరారు. ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా వెట్టిచాకిరి చేస్తున్నామని, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగభద్రత, ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. నెలకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో మండలశాఖ అధ్యక్షురాలు పార్నంది అంజలి, కార్యదర్శి కల్పన, బెజ్జంకి సరోజన, సునీత, నాగరాణి, సుగుణ, శోభ, పద్మ, స్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

గంగాధర: సమస్యలు పరిష్కరించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు గురువారం ఆశ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. బూరుగుపల్లిలో క్యాంపు కార్యాలయంలో కలిశారు. సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు గడ్డం పరిమిత, చిరుమల కరుణ పాల్గొన్నారు.

శంకరపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో నెలకు పదివేల వేతనం ఇస్తున్న మాదిరిగా తెలంగాణలోనూ అందించాలని ఆశ కార్యకర్తలు కేశవపట్నం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కంటి వెలుగు, లెప్రసీ సర్వే అదనపు డబ్బులు, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ 16 నెలల బకాయి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

సంక్షిప్త వార్తలు

'అనైతికంగా మాట్లాడొద్దు'

చొప్పదండి: సీఎం కేసీఆర్ మెప్పు కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్‌పై అనైతికంగా మాట్లాడొద్దని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ హితవు పలికారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఏసీడీ చార్జీల పెంపును తగ్గించాలని, ధరణి పాసు బుక్స్ రాని వారికి ఇప్పించాలని, 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని, నిరుద్యోగ భృతి అందించాలని సూచించారు.

ప్రజా సంక్షేమ బడ్జెట్

సైదాపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరమల్ల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సైదాపూర్‌లో బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విశ్వకర్మలు, మత్స్యకారులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారని, మహిళలు, కర్షకులకు అనుకూలంగా బడ్జెట్ ఉందన్నారు. నాయకులు సంతోష్, శ్రీనివాస్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు రాహుల్, తిరుపతి, సాగర్, రాజమౌళిలు ఉన్నారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మానకొండూర్: మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి మండలంలోని విశ్వకర్మలు గురువారం క్షీరాభిషేకం చేశారు. బడ్జెట్‌లో విశ్వకర్మలకు ప్రత్యేక ప్యాకేజీని ఏర్పాటు చేసినందుకు, విశ్వకర్మ కౌశల్ యోజన ప్రవేశపెట్టిన సందర్భంగా పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచి పెట్టారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నందగిరి బలరాం, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, మియాపురం లక్ష్మణాచారి, నందగిరి రాజేందర్, నందగిరి వెంకటస్వామి, వనపర్తి బ్రహ్మయ్య, నందగిరి మల్లయ్యచారి, నందగిరి రాజు, మియాపురం రమణాచారి, నందగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పదండి: కేంద్ర బడ్జెట్‌లో విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గురువారం చొప్పదండిలోని మార్కెట్ చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. విశ్వబ్రాహ్మణుల శ్రమను గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలోజు రామానుజచారి, కట్ట శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి సర్వే నంబర్ 417లో రెండెకరాల 34 గుంటల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దొబ్బల మధు తహసీల్దార్ రాజుకుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. భూమి హద్దులు రెవెన్యూ అధికారులు నిర్ణయించాలని కోరుతూ సర్పంచ్ కోల రమేష్ అధ్యక్షతన తీర్మానం చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50వేల విరాళం


చెక్కు అందిస్తున్న జయప్రకాశ్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌కు చెందిన ముప్పిడి జయప్రకాశ్‌రెడ్డి గురువారం సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సై దాస సుధాకర్‌కు రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. గ్రామంలో 20 సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు తమవంతుగా సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని ఎస్సై కోరారు. అనంతరం జయప్రకాశ్‌రెడ్డి తనవంతు సాయం చేయడం అభినందనీయమన్నారు.

రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి


నాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: రాజా బహద్దూర్ వెంకటరాంరెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అల్గునూర్‌కు చెందిన కంది అశోక్‌రెడ్డి గెలుపొందారు. రెడ్డి సంఘం ఎన్నికలు జనవరి 29న నిర్వహించి 30న కౌంటింగ్ చేశారు. ఉపాధ్యక్షుడి రేసులో నాగేశ్వర్‌రెడ్డి 2,700ఓట్లు సాధించి విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గెలుపునకు కృషిచేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి సహకారం అందజేస్తామన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: ఉద్యోగ సాధనకు ప్రతి విద్యార్థి మెరుగైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని టాస్క్ ట్రైనర్ ఓంప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలో దశల గురించి వివరించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలనుకునే వారు కార్పొరేట్ స్కిల్స్ అలవర్చుకోవాలన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నిర్మించినా... నిరుపయోగమే!

ఇల్లందకుంట: మండల విద్యాధికారి పర్యవేక్షణలో పాఠశాలల నిర్వహణ తీరు మెరుగుపరచడానికి, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, సమావేశాల ఏర్పాటు కోసం మండల కేంద్రంలో రూ.31లక్షల వ్యయంతో ఎమ్మార్సీ భవనం నిర్మించారు. రెండేళ్లు గడుస్తున్నా రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. ప్రతి పనికి జమ్మికుంటకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎంఈవో, సీఆర్‌పీలు ఇక్కడి నుంచి మండలానికి సంబంధించిన పనులు చేపట్టాలి, కానీ జమ్మికుంటలోనే ఉంటూ పనులు చేయడం ఇబ్బందిగా ఉందంటున్నారు. రెగ్యులర్ ఎంఈవోను కేటాయించి భవనం అందుబాటులోకి తేవాలని ప్రజలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారిపేరు : జనార్దన్‌రావు, డీఈవో
ఫోన్ నంబర్ 79950 87617

క్షేత్రస్థాయి పంటల పరిశీలన


రామడుగు: వెదిరలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో హుజూరాబాద్ ఏఏడీ సునీత గురువారం క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. రైతులు ఎరువులతో పాటు క్రిమిసంహారక మందులు ఒకేసారి వెదజల్లుతున్నారని, ఇలా చేస్తే పొలాలు చౌడుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. మోతాదుకు మించి మందులు పిచికారీ చేయొద్దని, గుళికలను ఎరువులో కలిపి వేయొద్దని సూచించారు.

డ్రోన్‌ల వినియోగంపై అవగాహన

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో గురువారం వరిలో డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ విధానంపై వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి యాస్మిన్ మాట్లాడుతూ..అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్టు 2022–23 లో భాగంగా డ్రోన్ యంత్రం ద్వారా నానో యూరియా పిచికారీపై ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల్లు,ఎంపీటీసీ, ఉపసర్పంచ్ , ఆర్‌బీఎస్ కోర్డినేటర్,ఏఈవో పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని గోపాల్‌రావుపేటలో డ్రోన్‌ల వినియోగంపై రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. 25 ఎకరాల్లో నానోయూరియా డ్రోన్‌తో పిచికారీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, సర్పంచ్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి రూ. 51 వేల విరాళం

చొప్పదండి: పట్టణంలో సాయిబాబా ఆలయ నిర్మాణానికి పట్టణానికే చెందిన నలుమాచు శంకరయ్య జ్ఞాపకార్థం కుమారుడు నలుమాచు ప్రభాకర్, భాగ్యలక్ష్మి దంపతులు గురువారం రూ. 51 వేల విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి విరాళం అందించారు. మార్చి 9న ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లింగయ్య, దూస రాము, కటుకం భూమయ్య, వెంకటేశం, మంచాల మోహన్, మునిందర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగట్టు గుట్టపై నిత్యహోమం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, యజ్ఞాచార్యులు చిగురాల రామకృష్ణాచార్యులు వేదమంత్రోచ్చరణల మధ్య నిత్యహోమం, బలహరణం నిర్వహించారు. భూదేవి, నీలాదేవితో స్వామి వారు మాడవీధుల్లో పల్లికిలో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ మల్హర్‌రావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి వెంకటాద్రినగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు హరికృష్ణామాచార్యులు, వేణుగోపాల చార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళ శాసనం, గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి, బలిహరణం, సాయంత్రం యాగశాలలో చతుస్థానార్చన, దేవతాహ్వానం, హనుమాత్ వాహన సేవ, అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు శ్రీనివాస్, శివనాథుని కిషన్, ఐతు రమేష్, గుండా తిరుపతయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు


గన్నేరువరం: పోచమ్మ బోనాలు సమర్పిస్తున్న భక్తులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, ఒగ్గు పూజారులు, బైండ్ల కొలుపు శివసత్తుల పూనకాలతో మహిళలు నెత్తిన బోనంతో గ్రామ వీధులు గుండా ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.